
# తల్లికడుపు చల్లగా.....



చలి! చలి! చలి!

ధనుర్మాసం ఉదయాన మంచు పొరలింకా విచ్చుకోలేదు. పొగమంచు బాగా కమ్ముకోటాన పదడుగుల దూరంలో ఉన్న చింతచెట్లు కూడా కన్పించటం లేదు. పదేళ్ళ రంగడు కృష్ణ స్నానానికి బయలుదేరాడు.

చలి! చలి! చలి!

"ఉహుహుహూఁ ......" అంటూ వణికిపోయాడు రంగడు. రంగడికి ఓ సంగతి జ్ఞాపకం వచ్చింది. ఓసారి సూరన్న తాతని అడిగాడు "చలి ఎక్కణ్ణించి వస్తుంది తాతా!"

"ఎక్కణ్ణించో రావటమేమిట్రా ..... నీ గుప్పిటలోనే ఉంటుంది చలి" అన్నాడు సూరన్న.

గుప్పిటలు విప్పేశాడు రంగడు. చలీ గిలీ పారిపోయింది. ఎగిరి గంతేశాడు. పరుగు పరుగున కృష్ణ వొడ్డుకి వచ్చాడు. కృష్ణనిండా పొగమంచు - ప్రవాహం కన్పించటంలేదు. నీళ్ళలో వేళ్ళు పెడితే కొంకర్లు పోతున్నాయి. శరీరమంతా

చల్లగా మంచుముద్దయి పోతోంది. రంగడు స్నానం చేయటానికి తటపటాయిస్తూ వొడ్డునే కూర్చుని నీళ్ళ పైన పేరుకున్న చలి పొరని చెదర గొడ్తున్నాడు.

ఇంతలో గుళ్ళోంచి శంఖం మోత విన్పించింది.

'అమ్మో! వూరేగింపు బయలుదేరే వేళయింది' అనుకుంటూ చెంగున నీళ్ళలోకి దూకాడు రంగడు. బారలు బారలుగా ఈది ఇంకా లోపలికెళ్ళి బుడుంగున మునిగాడు.

కృష్ణలోపల వెచ్చగా ఉంది. హాయిగా ఉంది. అమ్మకడుపులో ఉన్నట్లు నిశ్చింతగా ఉంది. కృష్ణ లోలోపల అలలు అలలుగా, వెచ్చవెచ్చగా వొళ్ళంతా ప్రేమగా నిమురుతోంది. రంగణ్ణి ఓసారి వాళ్ళమ్మ వొళ్ళో పడుకోబెట్టుకుని వొళ్ళు నిమురుతూ 'నువ్వుచక్కగా చదువుకుని గొప్పవాడివవ్వాలి' అంటూ మౌనంగా చేతులతో రాస్తుంటే ఎంతో హాయనిపించింది. మళ్ళీ అంత సుఖంగా ఉంది కృష్ణ కడుపులో. అందుకే తనకి అమ్మ అంటే ఇష్టం ! కృష్ణంటే ఇష్టం.

మళ్ళీ గుళ్ళో శంఖం మోగింది.

"అయ్య బాబోయ్! వేళయిపోతోంది" అంటూ గబగబా వొడ్డుకొచ్చాడు. వొడ్డుకి వచ్చీ రావటంతోటే మళ్ళీ చలి చుట్టు ముట్టేసింది. గజగజ వణకుతూ తుండు పిండుకుంటూ "నేను తప్ప ఇంకెవరూ ఇంత చలిలో స్నానం చెయ్యలేరు" అనుకుంటూ పక్కకి చూస్తే ఓ అరవై ఏళ్ళ ముసలమ్మ తనలాగే స్నానం చేసి చీర పిండుకుంటోంది. ఆశ్చర్యం వేసింది. ఆ అవ్వ చలికి వణకటం కూడా లేదు. అలా చూస్తున్న రంగడితో అవ్వ అంది. "నాయనా! నాకు కళ్ళు మసకలు. కొంచెం ఈ రాళ్ళు దాటిస్తావా?" సమాధానం కూడా చెప్పకుండా చేయందించాడు రంగడు. రంగడు అవ్వనే చూస్తున్నాడు. ముఖంనిండా పచ్చగా పసుపు రాసుకుంది. నుదుటిమీద పెద్ద కుంకం బొట్టు. వెండి జలతారులా పెద్ద జుట్టు. రాళ్ళు దాటిస్తూ రంగడడిగాడు "అవ్వా మీదే ఊరు."

ఇంతలో గుళ్ళో మళ్ళీ శంఖం మోత.

అవ్వచెప్పే సమాధానం వినకుండా "నే వెళ్ళొస్తానవ్వా!" అంటూ పరుగు పరుగున ఇంటికొచ్చేశాడు రంగడు.

ఇంటికొచ్చీ రావటంతోటే లాగూ చొక్కా తగిలించుకుని "అమ్మా! నేను వూరేగింపు కెళ్తున్నా!" అని దొడ్లో ఉన్న తల్లికి ఓ కేక పెట్టి వీధిలోకొచ్చి పడ్డాడు. వీధిలోని తనీడు పిల్లల్నందర్నీ పేరు పేరునా పిలిచి పదిహేనుమంది జట్టుతో గుళ్ళోకి పరుగెత్తాడు.

దేవుణ్ణి పల్లకీలో వేంచేపు చేశారు. సన్నాయి మేళంతో వూరేగింపు బయలుదేరింది! పెద్ద బజారునిండా ముగ్గులు. ఆ ముగ్గులమీద పసుపు కుంకుమలు. ఆ పసుసు కుంకుమల నడుమ గొబ్బెమ్మలు. ఆ గొబ్బెమ్మల తలల్లో బంతిపూలు. పల్లకీ హారతి ఉన్న చోటల్లా ఆగుతోంది. దేవుడికి హారతి ఇస్తున్నప్పుడు సన్నాయి ఆగిపోగా భజన సాగుతోంది. ప్రతి ఇంటిముందు పిల్లలు కూడా హారతి కళ్ళకద్దుకుంటున్నారు. నివేదన చేసిన రేగిపళ్ళు పంచిపెడ్తే టక టక నమిలేస్తున్నారు. అలా నాలుగు వీధులూ పల్లకీతో తిరుగుతూ ఎన్ని హారతులు కళ్ళ కద్దుకున్నారో! ఎన్ని రేగుపళ్లు నమిలారో? పళ్ళు పులిసిపోయాయి.

చల్లమ్మగారింటి దగ్గర హారతి ఇస్తుంటే రంగడు పక్కకి తప్పుకున్నాడు. ఎందుకంటే ఓ రోజున చల్లమ్మ అప్పడాలు ఎండబెట్టింది. రంగడు వెళ్ళి "నాకో అప్పడం ఇవ్వవా?" అన్నాడు. చల్లమ్మ ఒకటిచ్చింది.

అది ఎడం చేతిలో పెట్టుకుని "మా అమ్మకో!" ఒ న్నాడు.

"భడవా! నీకిచ్చింది కాక మీ అమ్మకు కూడానా ఫో"అంది.

రంగడికి చెడ్డ కోపమొచ్చింది. చల్లమ్మని ఇంట్లోకి పోనిచ్చి అప్పడాలన్నీ కుప్పపోసి ముక్కలు ముక్కలుగా తొక్కి పరుగెత్తుకొచ్చాడు. ఆ తర్వాత పెద్ద గొడవై తల్లి వెళ్ళి క్షమాపణ చెప్పుకోవటంతో సరిపోయింది. అప్పటి నుంచి చల్లమ్మని చూస్తే రంగడికి భయం. ఆ సంగతి తెలిసిన వాళ్ళందరూ రంగడు "మా అమ్మకో?"

అని అడగక ముందే రెండు ఇస్తారు.

పిల్లల సరదా అంతా వూరేగింపు మీద కాదు. దేవుడు గుళ్ళోకి తిరిగొచ్చింతర్వాత పెట్టే దధ్యోజనం మీద. ప్రసాదం పంచి పెడ్తుంటే పిల్లలు ఒకటే గోల. ఇంట్లో చద్ది ఎన్నిసార్లు చేసుకుంటాం కాదు. కాని ఆ రుచి రాదేం!"

"దధ్యోజనం రుచి అంతా కరివేపాకులో ఉందిరా!" అన్నాడు రంగడు.

"పులిహోర రుచి అంతా తిరగమోత మిరపకాయలో ఉందిరా" అన్నాడు ఇంకొకడు.

రంగడి వంతు వచ్చింది. ఒకచేత్తో చద్ది పెట్టించుకుని రెండోచెయ్యి చూపించి "మా అమ్మకో?" అన్నాడు. అర్చకుడు నవ్వుకుని రెండో చేతిలో కూడా పెట్టాడు. రంగడు సంబరంగా మెట్లుదిగి వస్తుంటే మెట్లకింద పొద్దున్న కృష్ణదగ్గర కన్పించిన అవ్వ కనిపించింది,

"నాయనా! కళ్ళు కానను పైకి వెళ్ళలేను. కొంచెం ప్రసాదం పెట్టరా!" అంది.

రంగడు చిక్కులోపడ్డాడు. అమ్మకీ, తనకీ ఉంది ప్రసాదం.

"మాఇంటికి రా అవ్వా అన్నం పెట్టిస్తా" అన్నాడు.

"అన్నమెందుకురా! అయ్య ప్రసాదం కావాలిగాని" అంది అవ్వ. రంగడు కాదనలేక తన ప్రసాదం అవ్వచేతుల్లో పెట్టి ఇంటికి పరుగెత్తుకొచ్చాడు.

గుమ్మంలో స్నానంచేసి నుంచున్న తల్లి చేతిలో ప్రసాదం పెట్టాడు. "మరి నీకో?" అంది. తల్లి "నాది గుళ్లో ఓ అవ్వకిచ్చేశా" అన్నాడు రంగడు. "మరయితే ఇది నువ్వు తీసుకో" అంది తల్లి. "కాదు నీకే" అన్నాడు రంగడు. కాదు కాదని కొడుకుచేత బలవంతాన తినిపించింది తల్లి.

"ప్రసాదం రుచి అంతా కరివేపాకులో ఉంటుందమ్మా" అంటూ కరివేపాకు తల్లి నోటికందించాడు రంగడు.

రంగడి తల్లి నవ్వుతూ కరివేపాకు చప్పరిస్తూ కొడుకుని వొళ్లోకి తీసుకుని నిమిరింది. రంగడికి కృష్ణమ్మ కడుపులో స్నానమాడినట్లనిపించింది.*